క్లుప్తంగా

పురావస్తు శాఖ ఏడీ ఆఫీస్ ఏర్పాటు చేయాలి

నల్లగొండ : పానగల్లు మ్యూజియం ఆవరణలో రాష్ట్ర పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయం ఏర్పాటు చేయాలని ఎంబీసీ జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయమై రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, పురావస్తు, పర్యాటక శాఖ మంత్రులకు తెలియజేసినట్లు పేర్కొన్నారు.

ఆర్థిక సాయం అందజేత


బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస సమరధ్

మిర్యాలగూడ అర్బన్: ఏడాడి కిందట ఏరియా ఆస్పత్రిలో స్టాఫ్ నర్సుగా పనిచేస్తున్న మౌలాబీ అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ఏరియా ఆస్పత్రిలో పని చేస్తున్న వైద్యులు, తోటి నర్సులు, ఇతర వైద్య సిబ్బంది తమ వంతు సాయంగా రూ.2.50 లక్షల ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస సమరధ్ మృతురాలి కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే భాస్కర్‌రావు సహకారంతో ఆస్పత్రి సిబ్బంది మౌలాబీ కుటుంబానికి అండగా నిలవడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తిపురారం : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం బజార్‌లో పడిశల నాగయ్య ఇల్లు ప్రమాదవశాత్తు ఆదివారం విద్యుత్ షర్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. దీంతో ఆ ఇంటిలోని వస్తువులన్ని కాలిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న వసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి బాధిత కుటుంభానికి తక్షణ ఆర్థికసాయంగా రూ. 5వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జంగిలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రకు తరలిరావాలి

మర్రిగూడ : గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈనెల 20న జిల్లా కేంద్రంలో నిర్వహించే పాదయాత్రకు కార్మికులు తరలిరావాలని ఆ సంఘం జిల్లా కమిటీ సభ్యుడు ఏర్పుల యాదయ్య కోరారు. శనివారం మర్రిగూడ మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అందించాలని, మల్టీపర్పస్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలన్నారు. సమావేశంలో వట్టిపల్లి హనుమంతు, ఉరిపక్క లింగయ్య, పెరుమాళ్ల మంజుల, తిప్పర్తి లింగయ్య, సునీత తదితరులు పాల్గొన్నారు.

నవగ్రహాల ప్రతిష్ఠాపనకు రూ.1.50లక్షల విరాళం

రామగిరి(నల్లగొండ) : శివరాత్రి పండుగ సందర్భంగా ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శనివారం తిప్పర్తి మండలంలోని రామలింగాలగూడెం భక్త మార్కేండేయస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయంలో శివలింగానికి అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో నవ గ్రహాల ప్రతిష్ఠాపనకు రూ.1.50లక్షల ఆర్థికసాయం ప్రకటించారు. ఈమేరకు తక్షణమే రూ.50 వేలు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆయన వెంట నాయకులు బద్దం సుధీర్, ప్రశాంత్, జూకూరి రమేష్, ఎంపీటీసీ పల్లె ఎల్లయ్య, మట్టయ్య, వనపర్తి అంజయ్య తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ఏకాగ్రతతో విద్యనభ్యసించాలి


కేజీబీవీలో విద్యార్థినులకు పరీక్ష ప్యాడ్‌లను అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

శాలిగౌరారం: విద్యార్థులు ఏకాగ్రతతో విద్యనభ్యసించాలని లయన్స్ క్లబ్ జిల్లా ఎల్‌సీఐఎఫ్ కోఆర్డినేటర్, చెస్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ గందూరి కృపాకర్ అన్నారు. గురుజాల మాజీ సర్పంచ్ మారం వేణుగోపాల్‌రెడ్డి తన కుమారుడు పవన్‌కుమార్‌రెడ్డి జ్ఞాపకార్థం శాలిగౌరారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని కేజీబీవీలో విద్యార్థినులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. అదేవిధంగా విద్యాలయానికి చెందిన విద్యార్థిని కోలాట బృందానికి తనవంతుగా డ్రెస్‌కోడ్ చీరలు అందజేస్తానని ప్రకటించారు. అనంతరం మండల కేంద్రంలో లయన్స్‌క్లబ్ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జోనల్ చైర్మన్ ఎర్ర శంభులింగారెడ్డి, దేవరశెట్టి శ్రీనివాసులు, బాణాల రాంరెడ్డి, శాలిగౌరారం క్లబ్ అధ్యక్షుడు బుడిగె శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి దునుక వెంకన్న, ప్రతినిధులు వెంకటాచారి, మహేందర్‌రెడ్డి, ఆంజనేయులు, అశోకాచారి, వేణుగోపాల్‌రెడ్డి, వెంకటరామశర్మ, సుబ్రమణ్యశర్మ, రామ్మూర్తి, శ్రీనివాసులు, భీష్మాచారి, రమేశ్; ప్రణయ్, భిక్షం, కేజీబీవీ ఎస్‌ఓ ఉమాదేవి పాల్గొన్నారు.

శైవ క్షేత్రాల్లో భక్తజన సందోహం


మిర్యాలగూడ : శెట్టిపాలెం ఉమామహేశ్వరాలయంలో పూజలు చేస్తున్న భక్తులు


పెద్దవూర : బట్టుగూడెంలో సామూహిక అభిషేకంలో పాల్గొన్న భక్తులు


అడవిదేవులపల్లి : మహిషాసురమర్దిని దేవాలయంలో పూజలు చేస్తున్న మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే భాస్కర్‌రావు

- వైభవంగా శివరాత్రి ఉత్సవాలు
- శివనామస్మరణతో మార్మోగిన శివాలయాలు

మిర్యాలగూడ : మహా శివరాత్రి సందర్భంగా శనివారం దామరచర్ల మండలంలోని వాడపల్లిలో కృష్ణా, మూసీ నదుల సంగమం వద్ద కొలువైన శ్రీమీనాక్షి అగస్త్యేశ్వరస్వామి ఆలయం, శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం, దామరచర్ల మండల కేంద్రంలోని త్రిలింగేశ్వర ఆలయాలకు భక్తులు తెల్లవారు జామునుంచే పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు స్వామివార్లను దర్శించుకోని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రోస్ కార్పొరేషన్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, జెడ్పీటీసీ లలితహాతీరాంనాయక్, ఎంపీపీ నందినిరవితేజ, రైతుబంధు సమితి నాయకులు వీరకోటిరెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ నారాయణరెడ్డి, సర్పంచ్ మాధవి పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ పట్టణంలోని మెయిన్ బజారులో గల శ్రీ భ్రమరంబదేవీ సమేత శ్రీమల్లిఖార్జునస్వామి శివాలయం, చైతన్యనగర్‌లో ఉమా మహేశ్వకరస్వామి దేవాలయంలో మహా శివరాత్రి సందర్భంగా తెల్లవారు ఝూము నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మెయిన్‌రోడ్డు శివాలయంలో తెలంగాణ ఆగ్రోస్ కార్పొరేషన్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్-నాగలక్ష్మి దంపతులతో పాటు ఆయన కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. మెయిన్‌రోడ్డులో గల శివాలయం, శ్రీ ఉమమహేశ్వరస్వామి దేవాలయంలో రాత్రి 10:30 గంటలకు స్వామివారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అలాగే పటణానికి చెందిన కార్పెంటర్ చారీ రూ.2లక్షల విలువ గల వెండి నాగుపాము తొడుగును మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ బండారు కుశలయ్య ఆధ్వర్యంలో ఆలయానికి బహూకరించారు.

అడవిదేవులపల్లి : మండల కేంద్రంలోని మహిషాసురమర్దిని దేవాలయంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా అమ్మవారికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే నలమోతు భాస్కర్‌రావు, తెలంగాణ ఆగ్రోస్ కార్పొరేషన్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డిలు ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం కృష్ణానది సమీపంలో గల పంచాయతన సోమేశ్వరస్వామి(బౌద్ధమ గుళ్లు) ఆలయంలో కూడా ప్రత్యేక పూజలను నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించిన తరువాత అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బాలాజీనాయక్, మాజీ ఎంపీపీ మంగమ్మ, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రామయ్య, స్థానిక సర్పంచ్ మర్రెడ్డి, ఎంపీటీసీ లింగయ్య, మండల పార్టీ కార్యదర్శి శ్రీనునాయక్, పాల్గొన్నారు.

హాలియా : మహా శివరాత్రి ఉత్సవాల సందర్భంగా అనుముల మండలంలోని పేరూర్ గ్రామ స్వయంభూ శ్రీ సోమేశ్వరస్వామి ఆలయంలో నాగార్జున సాగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే నోముల భగత్, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ సీఎల్పీనేత కుందూరు జానారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పేరూర్ దేవస్థానం చైర్మన్ రామలింగయ్య, సర్పంచ్ సుధారాణినాగరాజు, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మాజీ సీఎల్పీ నేతను శాలువాలతో ఘనంగా సత్కరించారు. మహా శివరాత్రి వేడుకల సందర్భంగా భక్తులు తెల్లవారు జామునుంచే ఆలయం వద్దకు చేరుకొని శివ పార్వతులను దర్శించుకొని తమ మొక్కులను తీర్చుకుని కానుకలను సమర్పించారు.

కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే భగత్..

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని వెనిగండ్ల శివాలయంలో నిర్వహించిన శివపార్వతుల కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే నోముల భగత్, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ఎస్ఆర్‌ఐ మన్నెం రంజిత్ యాదవ్‌లు పాల్గొన్నారు. మండలంలోని శివాలయాల వద్ద శనివారం భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు చేశారు. నిడమనూరు శ్రీనాగలింగేశ్వర స్వామి గుడిలో శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించారు.

త్రిపురారం : మండలంలోని నీలాయిగూడెం గ్రామంలోని శివాలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే నోముల భగత్ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భగత్‌ను ఆలయ పాలక వర్గం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి, మహిళ అధ్యక్షురాలు ధనలక్ష్మి, వెంకటాచారి, నగేష్ పాల్గొన్నారు.


నిడమనూరు : వెంగన్నగూడెంలో శివపార్వతుల కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే నోముల భగత్


నిడమనూరు : వెంగన్నగూడం శివాలయంలో మహాశివరాత్రి వేడుకల్లో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : మహాశివరాత్రి వేడుకల సందర్భంగా శనివారం మండలంలోని రాజవరం శివారులో మల్లప్పాయ శివాలయానికి భక్తులు వేకువజామున నుంచే దర్శనానికి బారులుదీరారు.

ఇష్టకామేశ్వర స్వామి ఆలయంలో ..

పెద్దవూర : మహాశివరాత్రి సందర్భంగా బట్టుగూడెంలోని ఇష్టకామేశ్వరస్వామి దేవాలయానిక భక్తుల పెద్ద ఎత్తున్న తరలివచ్చారు. అలాగే ఆలయంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి నాయకులు కుందూరు జయవీర్‌రెడ్డి, తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, సినీ హీరో అల్లు అర్జున్ మామ కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి దంపతులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి-నివేదితారెడ్డి దంపతులు ఇష్టకామేశ్వరుడికి పాలాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పిన్నవూర గ్రామంలోని శ్రీరామకోటీశ్వరాలయంలో మాజీ ఎమ్మెల్సీ తేరా చిన్నపురెడ్డి హాజరై పూజలు నిర్వహించారు.

గుర్రంపోడు : మండలంలోని మహాశివరాత్రి సందర్భంగా దేవాలయాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పూజలు పాల్గొన్నారు. మొసంగి, కొప్పోలు, వట్టికోడు, పాల్వాయి తదితర గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దేవరకొండ : మహా శివరాత్రి పర్వదినాన్ని శనివారం దేవరకొండ మండల పరిధిలో భక్తులు ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని శ్రీ భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి దేవాలయం, పాత శివాలయం, మార్కండేయస్వామి దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని ఖిల్లా దుర్గానికి చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వచ్చి పూజలు నిర్వహించారు.

చింతపల్లి : మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో శనివారం మహా శివరాత్రి పర్వదినాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండల కేంద్రంలోని రాజరాజేశ్వర దేవాలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కుర్మేడు, మాల్ వెంకటేశ్వర నగర్, వెంకటంపేట, నెల్వాలపల్లి శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.


హాలియా : పేరూర్ శివాలయంలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి జానారెడ్డి

కొండమల్లేపల్లి : మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా కొండమల్లేపల్లిలోని శ్రీ సీతారామచంద్రమౌళీశ్వరస్వామి దేవాలయంలో శివలింగానికి అభిషేకాలు నిర్వహించారు. సర్పంచ్ కుంభం శ్రీనివాస్‌గౌడ్ దంపతులు పాల్గొని అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా శనివారం రాత్రి ఆలయంలో శివ పార్వతుల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి పాలగణపతి శర్మ, శివయ్యశర్మలు తెలిపారు. కొండమల్లేపల్లి ఎంపీపీ రేఖశ్రీధర్‌రెడ్డి దంపతులు పూజల్లో పాల్గొని శివ లింగానికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

చందంపేట : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని దేవరచర్ల గుట్టపై ఉన్న మునిస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. ఉమ్మడి చందంపేట మండలం నుంచే కాకుండా రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి శివలింగాన్ని దర్శించుకున్నారు. కాగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయగా, హెల్పింగ్ నేచర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భక్తులకు తాగునీటి వసతి కల్పించారు.


దేవరకొండలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో బారులుదీరిన భక్తులు


మిర్యాలగూడ టౌన్: శివాలయంలో పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్మన్ భార్గవ్ దంపతులు


తిరుమలగిరి.. మల్లప్పాయ శివాలయంలో దర్శనానికి నిల్చున్న భక్తులు


పెద్దవూరలో పూజలు నిర్వహిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి దంపతులు


కొండమల్లేపల్లి శ్రీ సీతారామచంద్రమౌళేశ్వర స్వామి దేవాలయంలో..


దేవరకొండ : పాత శివాలయంలో..


మిర్యాలగూడ టౌన్: మెయిన్‌బజారులోని శివాలయంలో భక్తుల సందడి


పెద్దవూర: పిన్నవూరలో శివుడికి అభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ తేరా చిన్నపరెడ్డి

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కొండమల్లేపల్లి : రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ నాయకుడు డాక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం కొల్‌ముంతలపహాడ్ బూత్ నంబర్ 119, 120, 121లకు చెందిన పార్టీ నాయకులుతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజా సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ చిలువేరు శ్రీధర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మండల అధ్యక్షుడు బొడిగె సాంబశివగౌడ్, బొడ్డు శ్రీను, రమావత్ విజయ్‌కుమార్, ఉప్పల శ్రీశైలం, పేర్ల జితేందర్, మాచర్ల వెంకటయ్య, యాదగిరి, నగేశ్, తారయ్య, గోపి, ఎలిజర్ల శ్రీను, బొడ్డుపల్లి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ఛత్రపతి శివాజీ జయంతి

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల కేంద్రంలో ఆదివారం ఛత్రపతి శివాజీ జయంతిని నిర్వహించనున్నట్లు శివాజీ సేవా సమితి సభ్యులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా కొండమల్లేపల్లిలోని పాత ఊరు ఆంజనేయ స్వామి దేవాలయం నుంచి భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఉర్సు ఏర్పాట్లను పరిశీలించిన సీఐ


ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఐ విఠల్‌రెడ్డి

చింతపల్లి : మండల పరిధిలోని పీకే.మల్లేపల్లిలో ఈనెల 21నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్న అజహరత్ అబ్బాస్ దర్గా, మక్కా మహేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను శనివారం నాంపల్లి సీఐ విఠల్‌రెడ్డి పరిశీలించారు. ఉత్సవాలకు వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎస్ఐ రమేష్, నిర్వాహకులు సయ్యద్‌పాషా తదితరులున్నారు.

ఘనంగా దున్న ఇద్దాస్ ఆరాధనోత్సవాలు


పూజలు చేస్తున్న భక్తులు

పెద్దవూర : మండలంలోని చింతపల్లి లో కొలువై ఉన్న తొలి దళిత కవి, మాదిగ మహాయోగి బిరుదాంకితుడు, జీవ సమాధి అయిన తత్వవేత్త దున్న ఇద్దాస్ ఆరాధనోత్సవాలను మహాశివరాత్రి సందర్భంగా భక్తులు వైభవంగా నిర్వహించారు. దున్న ఇద్దాస్ వాడుక భాషలో తత్వాలను రాసి ప్రజలను ఆధ్యాత్మికం వైపు మరల్చిన మహనీయుడిగా ప్రసిద్ధి చెందాడు. జిల్లానుంచే కాక మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూలు, రంగారెడ్డి తదితర జిల్లాల నుంచి ఆయన భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి జీవ సమాధి వద్దనే జాగారం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుంకిరెడ్డి ప్రభావతిసంజీవరెడ్డి, ఉప సర్పంచ్ కాంసాని భారతికొండల్, ఆలయ కమిటీ చైర్మన్ షేక్ అబ్బాస్, వైస్ చైర్మన్ జంగయ్య, సుంకిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీహెచ్. రమేష్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

25 పంచాయతీ భవనాలకు నిధులు మంజూరు


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

దేవరకొండ: దేవరకొండ నియోజకవర్గ పరిధిలోని 25గిరిజన తండాల గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే రవీంద్రకుమార్ శనివారం తెలిపారు. 25 పంచాయతీ భవన నిర్మాణాలకు గాను జీఓ నంబర్ 32 ద్వారా గిరిజన సంక్షేమ శాఖ నుంచి రూ.5కోట్ల నిధులు మంజూరు అయ్యాయని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసిఆర్ పాలనలో గిరిజన పంచాయతీలకు మహర్దశ వచ్చిందని తెలిపారు. నిధులు మంజూరు చేసినందుకు గాను సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, సత్యవతి రాథోడ్, జగదీశ్‌రెడ్డిలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన ఇద్దరికి సీఎం సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి మంజూరైన రూ.98వేల విలువైన చెక్కులను ఎమ్మెల్యే రవీంద్రకుమార్ శనివారం పంపిణీ చేశారు. పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మారుపాకుల సురేష్‌గౌడ్, టీవీఎస్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, బొడ్డపల్లి కృష్ణ, వడ్త్య బాలు, ఇలియాస్ పటేల్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

కట్టంగూర్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలు పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య తెలిపారు. శనివారం కట్టంగూర్ మండలంలోని అయిటిపాముల గ్రామానికి చెందిన ఎంపీటీసీ-1 బెల్లి మహాలక్ష్మిసుధాకర్‌తో పాటు వార్డు సభ్యులు, పలు పార్టీల నాయకులు నార్కట్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తరాల బలరాములు, వైస్‌ఎంపీపీ గడుసు కోటిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఏడుకొండలు, పీఏసీఎస్ చైర్మన్ నూక సైదులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పోగుల నర్సింహ, నాగరాజు, రవి, కోటేష్ ఉన్నారు.

'రైతుల పాలిట దగా పోర్టల్‌గా మారిన ధరణి'

మర్రిగూడ : రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి రైతుల పాలిట దగా పోర్టల్‌గా మారిందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చల్లమల్ల కృష్ణారెడ్డి అన్నారు. శనివారం మర్రిగూడ మండలం మేటిచందాపురం పరిధిలోని ఇందుర్తిలో శ్రీ శంభులింగేశ్వర స్వామి కల్యాణోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామానికి చెందిన పలు పార్టీల కార్యకర్తలు ఏరుకొండ రాము ఆధ్వర్యంలో చల్లమల్ల కృష్ణారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా ప్రతి గడపకు వెళ్లి 45 రోజుల్లో ప్రజా సమస్యలను గుర్తించడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు కాంగ్రెస్ పాలనను కోరుకుంటున్నారని, రాబోయే ఎన్నికల్లో మునుగోడు గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దామెర జీవన్, గిరి యాదయ్య, చేపూరి శ్రీను, నర్సింహ, అంజయ్య, మేతరి గిరి, శంకర్, సైదులు, అబ్బయ్య, గుయ్యని లింగయ్య, పాల్గొన్నారు.

క్రీడాకారులకు అండగా స్పోర్ట్స్ అసోసియేషన్


కీడా సామగ్రి అందజేస్తున్న ఎన్‌వీటీ, తదితరులు

దేవరకొండ : క్రీడాకారులకు దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఎప్పుడూ అండగా ఉంటుందని ఆ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ అన్నారు. శనివారం పట్టణంలోని అసోసియేషన్ భవనంలో మున్సిపాలిటీ పరిధిలోని ఆరో వార్డుకు చెందిన యూత్ సభ్యులకు చెస్, క్యారంబోర్డ్, వాలీబాల్ సంబంధిత క్రీడా సామగ్రిని అందజేసి మాట్లాడారు. దేవరకొండ నియోజకవర్గానికి చెందిన క్రీడాకారులు తాము ఎంచుకున్న క్రీడల్లో జాతీయ స్థాయిలో రాణించాలని ఆయన ఆకాంక్షించారు. ఇప్పటికే పలువురు క్రీడాకారులకు అసోసియేషన్ తరుపున అండగా నిలిచినట్లు తెలిపారు. అంతేగాకుండా అవుట్‌డోర్, ఇండోర్ స్టేడియంలు త్వరలోనే అందుబాటులోకి రానున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు స్థానిక ప్రజా ప్రతినిధులు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, రాపోలు నిరంజన్, తాళ్ల శ్రీధర్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి, కృష్ణకిశోర్, తాళ్ల సురేష్, వాసు, ఖాజా, భాస్కర్, జగదీశ్వరాచారి, చందునాయక్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి



ఆలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మాజీ మంత్రి జానారెడ్డి, ఎమ్మెల్యే నోముల భగత్

హాలియా : ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకొని భక్తిభావం వైపు నడవాలని మాజీ సీఎల్పీనేత కుందూరు జానారెడ్డి, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, సాగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే భగత్ పేర్కొన్నారు. శనివారం అనుముల మండలంలోని పేరూర్ గ్రామంలో దాతల సహకారంతో సుమారు రూ.2.50కోట్లకు పైగా నిధులతో చేపడుతున్న అత్యంత పురాతనమైన చెన్నకేశవ స్వామి ఆలయ పునఃనిర్మాణ శంకుస్థాపన పూజా కార్యక్రమానికి వారు వేర్వేరుగా హాజరై మాట్లాడారు. దాతల సహకారంతో చెన్నకేశవ స్వామి ఆలయ పునఃనిర్మాణం చేపట్టడం అభినందనీయమన్నారు.అనంతరం మాజీ సీఎల్పీనేత జానారెడ్డి, ఎమ్మెల్యే భగత్, ఎమ్మెల్సీ కోటిరెడ్డిని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పునర్నిర్మాణ కమిటీ అధ్యక్షుడు వికారాబాద్ సీఐ అర్కపల్లి ఆంజనేయులు, జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, హాలియా, నిడమనూరు మార్కెట్ కమిటీ చైర్మన్లు జవ్వాజి వెంకటేశ్వర్లు, మర్ల చంద్రారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మలిగిరెడ్డి లింగారెడ్డి, కేవీ రామారావు, రంజిత్ యాదవ్, బాబురావు నాయక్, అనుముల ఎంపీపీ పేర్ల సుమతిపురుషోత్తం, రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు చిన భిక్షం యాదవ్, తిరుమలగిరి మండల వైస్ ఎంపీపీ యడవెల్లి దిలీప్‌కుమార్, సర్పంచ్ సుధారాణినాగరాజు, ఎంపీటీసీల ఫ్లోరం జిల్లా అధ్యక్షుడు రాంబాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గౌనీ రాజారమేష్ యాదవ్, వెంకటేశ్వర్లు, ప్రసాద్ యాదవ్, షేక్ అస్గర్, రామలింగయ్య, పుల్లయ్య ఉన్నారు.

బాధిత కుటుంబానికి జానారెడ్డి పరామర్శ


కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జానారెడ్డి

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండలంలోని యల్లాపురం గ్రామానికి చెంది బద్దెల నాగరాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. శనివారం నిర్వహించిన ఆయన దశదిన కర్మలో మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి పాల్గొని నాగరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢసానుభూతి, సంతాపం వ్యక్తం చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పెద్దిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, రాజరమేష్ యాదవ్, నాగిరెడ్డి, వెంకన్న, సాలయ్య, గోవిందు ఉన్నారు.